# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 08 జులై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## గ్రూప్-1 పిటిషన్లపై తీర్పు రిజర్వ్




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రూప్-1 అంశంపై తెలంగాణ హైకోర్టు సోమవారంతో వాదనలు ముగిశాయి. న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు తీర్పును రిజర్వ్ చేశారు. గ్రూప్-1 అంశంపై సుదీర్ఘంగా వాదనలు సాగాయి. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని పలువురు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. మెయిన్స్ పత్రాలు పునః మూల్యాంకనం చేయాలని, మూల్యాంకనం చేయకపోతే మళ్లీ పరీక్షలు పెట్టాలని పిటిషనర్లు కోరారు. గతంలో గ్రూప్-1 నియామకాలపై స్టే ఇచ్చిన న్యాయమూర్తి రాజేశ్వర్‌రావు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. అదే సమయంలో స్టే ఎత్తివేయాలంటూ గ్రూప్-1కి ఎంపికైన పిటిషన్లు వేశారు. నియామకాలు పారదర్శకంగా జరిగాయని టీజీపీఎస్సీ న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. వాదనలు ఏమైనా మిగిలి ఉంటే రాతపూర్వకంగా సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

## అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం..

- హైదరాబాద్‌కు చెందిన కుటుంబం సజీవ దహనం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం సజీవ దహనమైంది. వెకేషన్ కోసం హైదరాబాద్ నుంచి వెంకట్-తేజస్వినీ దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి వెకేషన్ కోసం డలాస్ వెళ్లింది. సెలవుల దృష్ట్యా అట్లాంటలోని బంధువుల ఇంటికి కారులో వెంకట్ కుటుంబంతో కలిసి వెళ్లాడు. అట్లాంటా నుంచి డాలస్‌కు తిరిగి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. గ్రీన్‌కౌంటీ వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చి కారును మినీ ట్రక్కు ఢీకొట్టింది. ట్రక్కు ఢీకొట్టడంతో మంటలు చెలరేగి కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే సజీవ దహనమయ్యారు. ఈ ఘటనకు సంబంధించి ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మహిళలకు 60 సీట్లు

- గత పదేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను విస్మరించింది
- ప్రతి ఆడబిడ్డ ఇంట్లో కనీసం రెండు మొక్కలైనా నాటాలి
- ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం
- వనమే మనం, మనమే వనం : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఘనంగా వనమహోత్సవం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 60 ఎమ్మెల్యే టికెట్లు కేటాయించి, వారిని గెలిపించే బాధ్యత తాను తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గత పదేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలను విస్మరించిందని ఆరోపించారు. ఈ ఏడాది 18కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలోని బయోడైవర్సిటీ పార్కులో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌తో కలిసి రుద్రాక్ష మొక్కను సీఎం నాటి వనమహోత్సవం-2025ను ప్రారంభించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.

ప్రతి ఆడబిడ్డ ఇంట్లో కనీసం రెండు మొక్కలైనా నాటాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రతి ఆడబిడ్డ రెండు మొక్కలు నాటితే రాష్ట్రం ఆకుపచ్చ తెలంగాణగా మారుతుందని అన్నారు. "ఈ ఏడాది ఆటవీ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల మొక్కలను నాటాలన్న బృహత్తర కార్యక్రమాన్ని తీసుకుని ముందుకు వెళుతున్నాం. మనం చెట్టును కాపాడితే, చెట్టు మనల్ని కాపాడుతుంది. ఆడబిడ్డలు ఇంట్లో పిల్లలను పెంచుతున్నట్టుగానే ఇంటి ఆవరణలో కనీసం రెండు మొక్కలను నాటాలి. ప్రకృతిని కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందని అనుభవంతో నేర్చుకున్న పాఠాలు. అమ్మ పేరు మీద పిల్లలు మొక్కలు నాటాలన్న తరహాలోనే పిల్లల కోసం అమ్మ కూడా రెండు మొక్కలు నాటాలి. అలా చేస్తే తెలంగాణ మొత్తం హరితవనంగా మారుతుంది.

అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నందునే ప్రభుత్వం అన్నింటిలోనూ వారికి ప్రాధాన్యతనిస్తున్నాం. అమ్మ ఆదర్శ పాఠశాలలు, సోలార్ విద్యుత్ రంగంలో ప్రోత్సాహం, ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా, రాష్ట్రంలో వెయ్యి బస్సులను కొని స్వయం సంఘాల ద్వారా ఆర్టీసీకి అద్దెకు ఇచ్చారు. మహిళలు వ్యాపారాలు నిర్వహించడం ద్వారా బాగుంటుందని వారి చేతుల్లో పెట్టాం. హెటెక్ సిటీ వద్ద 3.5 ఎకరాల విలువైన స్థలంలో మహిళా సంఘాలకు కేటాయించి తద్వారా వారి ఉత్పత్తులను విక్రయించడానికి వీలు కల్పించాం. భారత్ సమ్మిట్, మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు అందరూ అక్కడికి వెళ్లి పరిశీలించారు. తెలంగాణ మహిళలు ప్రపంచంతో పోటీ పడుతున్నారనడానికి ఇదే ఉదాహరణ.

మహిళా సంఘాల్లో చేరడానికి కనిష్ట వయసును 15 సంవత్సరాలకు తగ్గించాం. రాష్ట్రంలోని మహిళా సంఘాల్లో సభ్యులను 67 లక్షల నుంచి కోటి మందికి పెంచి వారిని కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. మహిళా సంఘాలకు ఈ ఏడాది 21 వేల కోట్ల రూపాయల మేరకు బ్యాంక్ లింకేజీ ఇవ్వడం జరిగింది. నాతో పాటు వేదికపైన ఉన్న వారంతా ఇంట్లో ఏ బియ్యం తింటున్నామో ఆడబిడ్డలు కూడా ఆత్మగౌరవంతో ఉండే విధంగా సన్నబియ్యం అందిస్తున్నాం. అన్ని రంగాల్లో అక్కలు, ఆడబిడ్డలు ముందుండాలి. ఆడబిడ్డలను కాపాడుకోవడమే ఇందిరమ్మ రాజ్యం ఉద్దేశం. స్థానిక సంస్థల్లో స్వర్గీయ రాజీవ్ గాంధీ గారు రిజర్వేషన్లు కల్పించినట్టుగానే భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజనలో మహిళలకు అసెంబ్లీ స్థానాల్లోనూ రిజర్వేషన్లు పెరుగుతున్నాయి. ఆడబిడ్డలను గెలిపించుకునే పూచీ నాది. రానున్న రోజుల్లో ఆడబిడ్డలు రాజ్యాన్ని నడపాలి.." అని అన్నారు.

వనమే మనం, మనమే వనం అని పెద్దలు చెప్పారని, ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని అన్నారు. ప్రజాప్రతినిధులు, విద్యార్థులందరూ ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములై ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. గత ప్రభుత్వంలో ఐదేండ్లు క్యాబినెట్‌లో మహిళా మంత్రి కూడా లేరని విమర్శిం చారు. మహిళలను ప్రోత్సహిస్తూ తమ ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా, ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి, వారిని బస్సులకు యజమానులను చేశామని తెలిపారు. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, పట్టణ ప్రాంతాల్లోని మహిళలు కూడా మహిళా సంఘాల్లో చేరేలా కృషి చేయాలన్నారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల రుణాలు అందించామని తెలిపారు. అన్నిరంగాల్లో ఆడబిడ్డలను ముందు భాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నామని, ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. చెట్లను పెంచడం ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలుగుతామని అన్నారు. అడవుల్లో చెట్లను నరకడం వల్ల కోతులు గ్రామాల్లోకి వస్తున్నాయని, అటవీ సంపద పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భౌగోళిక పరిస్థితి మెరుగుపడే విధంగా రాష్ట్రమంతా విరివిగా వనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు, నరసింహారెడ్డి, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక



**10శాతం అదనపు సుంకం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత్, చైనా, రష్యా, బ్రెజిల్ ఇతర దేశాలతో కూడిన బ్రిక్స్ వేదికపై అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. బ్రిక్స్ అమెరికా వ్యతిరేకతను ప్రదర్శించింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటున్నాం, ఇక బ్రిక్స్ అనుకూల దేశాలన్నింటిపైనా 10 శాతం అదనపు సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా వ్యతిరేకతను ప్రదర్శించే ఏ దేశంతో కలిసి తిరిగే ఏ దేశం అయినా అమెరికా వ్యతిరేక దేశంగానే భావించి తాము తగు కఠిన చర్యలు తీసుకుంటామని ట్రంప్ హెచ్చరించారు. తమ ట్రూత్ సోషల్ మీడియా ద్వారా ట్రంప్ స్పందించారు. బ్రిక్స్ సంయుక్త తీర్మానం వెలువడిన తక్షణమే ట్రంప్ తీవ్రస్థాయి స్పందన వెలుగులోకి వచ్చింది. బ్రిక్స్‌లో భారతదేశం కూడా ఉండటం, బ్రెజిల్‌లో జరిగిన సదస్సులో ప్రధాని మోడీ ఆలోచనలకు అనుగుణంగానే సంయుక్త తీర్మానం వెలువడటం, అమెరికా సుంకాల జోరును ఇందులో తప్పుపట్టడం జరిగింది. ఈ దశలో అదనపు పది శాతం టారీఫ్‌ల జాబితాలో భారతదేశం కూడా ఉంటుందా? త్వరలో కుదిరే భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం భవిత ఏమిటనేది ఇప్పుడు కీలకం అయింది.

ఎలన్ మస్క్ కొత్త పార్టీ ఆలోచన అసంబద్ధం, అనుచితం అని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఈ అత్యంత సంపన్న మిలియనీర్ ఇప్పుడు పూర్తిగా పట్లా తప్పాడని వాఖ్యానించారు. ఒకప్పటి తన అత్యంత సన్నిహితుడు అయిన మస్క్ తాను అమెరికన్ పార్టీ అనే రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పుడున్న అధికార రిపబ్లికన్ పార్టీ, ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీలకు పోటీగా తమ పార్టీ ఉంటుందని మస్క్ ప్రకటించారు. ఇప్పుడు మస్క్ మూడో పార్టీని ప్రకటించడం ఆలోచనా రహితం అని ట్రంప్ తమ ప్రత్యేక ఎయిర్‌ఫోర్స్ విమానంలో బయలుదేరి వెళ్లేముందు మీడియాతో చెప్పారు.

## శాఖలపై మంత్రి వాకిటి శ్రీహరి అసంతృప్తి..!

- అస్తవ్యస్త శాఖలే అప్పగించారని ఆవేదన
- రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి తనకు కేటాయించిన శాఖలపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గత పదేళ్లలో పూర్తిగా దెబ్బతిన్న శాఖలనే తనకు అప్పగించారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, "నాకు ఇచ్చిన ఐదు శాఖలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇవి అదృష్టమో లేక దురదృష్టమో అర్థం కావడం లేదు," అంటూ అసహనం వ్యక్తం చేశారు. "గొర్రెలు, బర్రెలు ఇస్తే నన్నేం చేసుకోమంటారు?" అని ప్రశ్నించిన మంత్రి శ్రీహరి, పశుసంవర్ధక శాఖ గందర గోళంగా ఉందని వ్యాఖ్యానించారు. యువజన సర్వీసుల విషయంలో స్పష్టత లేదని, విధిగా నిరుద్యోగ యువతపై ప్రభావం చూపే విధంగా చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. మంత్రి వ్యాఖ్యలు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఓ సీనియర్ మంత్రి ఈ స్థాయిలో అసంతృప్తిని వ్యక్తం చేయడం రాజకీయ పరిణామాలకు దారితీయవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఇంతకుముందు కరీంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, క్రీడల అభివృద్ధిపై హామీలు ఇచ్చారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదనంగా కబడ్డీ, హ్యాండ్‌బాల్ కోర్టులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో కొత్త క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కరీంనగర్ క్రీడా పాఠశాలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారు.

## రేవంత్ రెడ్డి మాటలన్నీ అబద్ధాలే



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలువురు నాయకులు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలన్నీ అబద్ధాలేనని, ఆయనకి పాలన అసలు చేతకావడం లేదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారకరామారావు (కేటీఆర్) తీవ్రంగా మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి స్వాగతం పలికిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "ఈ ప్రభుత్వం కోతల ప్రభుత్వంగా మారిపోయింది. రేవంత్ రెడ్డికి కోతలు సరిపోవు... కర్రు కాల్చి వాతలు పెట్టాలి" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మీరు అందరూ అలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. "గతంలో ఎన్నో ప్రభుత్వాలు చూశాం, ఎన్నో ముఖ్యమంత్రులను చూశాం. కానీ రేవంత్ రెడ్డి లాంటి సీఎం మాత్రం చూడలేదు. ఈయన నోరా లేకుండా మాట్లాడుతారో, మోరా లేకుండా మాట్లాడుతారో చెప్పలేం" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఎన్నికల ముందు పీసీసీ అధ్యక్షుడిగా ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? రైతులకు రుణమాఫీ లేదు, రైతుబంధు లేదు. పాలన చేతకాక రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారు" అని ధ్వజమెత్తారు.

వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామంటూ రేవంత్ రెడ్డి చెప్పిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, "వందనా నీ బొందనా" అని అన్నారు. "ఈ రోజు రేవంత్ రెడ్డి సీఎంగా కూర్చోవడానికి కారణం కేసీఆరే. తెలంగాణ వచ్చినందుకు గులాబీ జెండా ఎగరవడమే కారణం. కేసీఆర్, టీఆర్ఎస్ లేకుంటే తెలంగాణ వచ్చేదా? అని రేవంత్ రెడ్డి తెలుసుకోవాలి," అంటూ వ్యాఖ్యానించారు. "పదేళ్లు మేము అధికారంలో ఉన్నాం. కానీ మేము ఇలా గందరగోళంగా పాలన జరిపే వాడులు కాదు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? రేవంత్ రెడ్డి పాలన అనేది అనిశ్చితిని తీసుకొస్తోంది," అని వ్యాఖ్యానించారు.

## పహల్గామ్ ఘటనను ఖండించిన బ్రిక్స్




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

బ్రెజిల్‌లో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో భారత్ తన దౌత్య నైపుణ్యంతో ప్రముఖంగా నిలిచింది. తీవ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేయించడంలో కీలక పాత్ర పోషించిన ప్రధాని నరేంద్ర మోదీ, అంతర్జాతీయ పాలనా వ్యవస్థల్లో సంస్కరణలపై గట్టిగా తన వాణిని వినిపించారు."సార్వత్రిక, స్థిరమైన పాలన కోసం గ్లోబల్ సౌత్ సహకారాన్ని బలోపేతం చేయడం" అనే అంశంతో సమావేశం కొనసాగగా, రియో డి జనీరో డిక్లరేషన్ను బ్రిక్స్ దేశాలు ఆమోదించాయి. ఈ తీర్మానంలో భారత్ కీలక అంశాలపై విజయం సాధించింది.

**పహల్గామ్ ఘటనపై తీవ్ర ఖండన**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన తీవ్రవాద దాడిని ప్రధాని మోదీ "మానవత్వంపై దాడి"గా అభివర్ణించారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. బ్రిక్స్ తీర్మానంలో ఈ దాడిని "తీవ్రంగా ఖండించామని" స్పష్టంగా పేర్కొనడమేగాక, "తీవ్రవాదంపై ద్వంద్వ నీతులు అనవసరం" అని పేర్కొనడం గమనార్హం. ప్రభుత్వ విదేశాంగ వ్యవహారాల శాఖ కార్యదర్శి డామ్ము రవి ప్రకారం, భారత్ కృషితో తీర్మానంలోని ప్యారా 34లో తీవ్రవాదాన్ని పెంపొందించే, సహకరిస్తున్న దేశాలపై చర్యలు తీసుకోవాలని ప్రస్తావించబడింది. "అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి తీవ్రవాదుల కదలికలపై చర్యలు తీసుకోవాలి" అన్న వాక్యం ద్వారా పాకిస్తాన్ పాత్రపై అభ్యంతరం వ్యక్తమైంది.

**చైనా ద్వంద్వ వైఖరిపై విమర్శలు**

పహల్గామ్ ఘటనను ఖండించినా, పాకిస్తాన్‌కు మద్దతుగా ఉగ్రవాదులపై ఐక్యరాజ్యసమితి నిషేధాలను అడ్డుకుంటూ వస్తోన్న చైనా వైఖరిపై విమర్శలు వ్యక్తమయ్యాయి. "రాజకీయ లాభాల కోసం మౌన సమ్మతి తెలిపే వారిని కూడా తీవ్రవాదానికి సహకరించేవారిగా పరిగణించాలి" అనే మోదీ వ్యాఖ్యలు చైనాపైనే లక్ష్యంగా ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ సమావేశానికి చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ బదులు ప్రధానమంత్రి లీ కియాంగ్ హాజరయ్యారు.

**గ్లోబల్ పాలనలో సంస్కరణలపై మోదీ గళం**

ప్రపంచ పాలనా వ్యవస్థలో సమతుల్యత అవసరమని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, అంతర్జాతీయ ద్రవ్య నిధి , ప్రపంచ బ్యాంకు , ప్రపంచ వాణిజ్య సంస్థ లాంటి సంస్థల్లో సమాన ప్రాతినిధ్యం కలిగేలా సంస్కరణలు చేపట్టాలని మోదీ అన్నారు. ప్యారా 6లో ఈ డిమాండ్‌ను మద్దతు పలకడం ద్వారా భారత్, బ్రెజిల్ లాంటి గ్లోబల్ సౌత్ దేశాల ప్రాధాన్యతను మళ్లీ గుర్తించారని డామ్ము రవి తెలిపారు. సమావేశంలో భారత్ బ్రిక్స్ శాస్త్రీయ, పరిశోధనా నిధి ఏర్పాటు, అత్యవసర ఖనిజాల సరఫరా భద్రత, బాధ్యతాయుత ఏఐ అభివృద్ధి అంశాలపై ప్రతిపాదనలు చేసింది. మలేషియా, దక్షిణాఫ్రికా, వియత్నాం తదితర దేశాలతో ద్వైపాక్షిక సమావేశాల్లో యూపీఐ వంటి డిజిటల్ వ్యవస్థల విస్తరణపై చర్చ జరిపింది.

**2026లో భారత్ అధ్యక్షతకు సిద్ధం**

2026లో బ్రిక్స్ అధ్యక్షత చేపట్టనున్న భారత్, ఈ సమావేశంలో మోదీ నేతృత్వం ద్వారా తీవ్రవాద వ్యతిరేక దేశంగా, సమానత్వం కోసం పోరాడే దేశంగా తన గౌరవాన్ని మరింత బలోపేతం చేసుకుంది. చైనా వైఖరి సవాలుగా ఉన్నా, భారత్‌కు ఈ సమావేశం దౌత్య విజయం సాధించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## 10న క్యాబినెట్ భేటీ


**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రతీనెలా రెండుసార్లు రాష్ట్ర మంత్రివర్గాన్ని సమావేశపర చాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయం మేరకు ఈనెల 10న క్యాబినెట్ భేటీ కానుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదో తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సీఎం అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గం సమావేశం కానుంది. స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లు, కొత్త రేషన్ కార్డుల జారీ, కాళేశ్వరం కమిషన్ విచారణ, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తదితరాంశాలపై మంత్రివర్గంలో చర్చించనున్నట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలక మండళ్ల పదవీకాలం ముగిసి ఏడాదిన్నర అయింది. పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో నడుస్తున్నాయి. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను రాబట్టాలంటే కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఉన్న పింఛన్ల పెంపుదల చేపట్టాలంటూ మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. వీటితోపాటు బీసీ రిజర్వేషన్లు, కేంద్ర ప్రభుత్వ వైఖరి, ఇందుకు సంబంధించి తీసుకోవాల్సిన నిర్ణయాలపై కూడా కూలంకుషంగా చర్చిస్తారని సమాచారం. అయితే ఢిల్లీలో ఉన్న సీఎం హైదరాబాద్‌కు చేరుకున్న తర్వాతే ఈ అజెండాకు తుది రూపునిచ్చి, ఖరారు చేస్తామని అధికారవర్గాలు తెలిపాయి.

## ఓట్లకు, ఓట్లకు మధ్య రైతుబంధు

- మాజీ మంత్రి హరీశ్ రావు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనను గాలికొదిలేసిందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కేవలం పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం ఇప్పుడు రైతుబంధు నిధులను విడుదల చేస్తోందని ఆయన ఆరోపించారు. సోమవారం నాడు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన గత బీఆర్ఎస్ పాలనను ప్రస్తుత ప్రభుత్వంతో పోలుస్తూ విమర్శలు గుప్పించారు. "కేసీఆర్ రైతుల అవసరాలు గుర్తించి నాట్లకు, నాట్లకు మధ్య రైతుబంధు ఇచ్చారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓట్లకు, ఓట్లకు మధ్య రైతుబంధు ఇస్తోంది" అని ఆయన ఎద్దేవా చేశారు. ఇది పూర్తిగా రాజకీయ లబ్ధి కోసమేనని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, గ్రామాల్లో ఎరువులు, యూరియా కొరత తీవ్రంగా ఉందని హరీశ్ రావు అన్నారు. ప్రభుత్వం రైతుల అవసరాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాల వల్ల పాలన కుంటుపడిందని ఆయన ఆరోపించారు.

# సమాజాభివృద్ధిలో విద్యార్థులు బాధ్యత తీసుకోవాలి

- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- కాకతీయ విశ్వవిద్యాలయంలో 23వ స్నాతకోత్సవం




**బలగం టీవీ, హనుమకొండ**

విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా దేశాభివృద్ధికి, సమాజాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గవర్నర్, కాకతీయ విశ్వవిద్యా లయ కులపతి జిష్ణు దేవ్ వర్మ అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన 23వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గవర్నర్.ఈ కార్యక్రమానికి ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాప్ రెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, కాకతీయ విశ్వవిద్యాలయం 50 ఏళ్ల గౌరవనీయమైన చరిత్ర కలిగిన విద్యాసంస్థగా గుర్తింపొందిందని చెప్పారు. ఉత్తర తెలంగాణ ప్రాంతంలో 672 ఎకరాల విస్తీర్ణంలో 23 విభాగాలు, 7 కళాశాలలు, 500 అనుబంధ కళాశాలలతో విశ్వవిద్యాలయం ఉత్తమ విద్యా సేవలను అందిస్తున్నదన్నారు. విద్యార్థులు ఇక్కడి నుంచి పొందిన విద్యను సామాజిక మార్పుకు దోహదపడేలా ఉపయోగించుకోవాలని సూచించారు.

ఈ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ స్వయంగా 564 బంగారు పతకాలను విద్యార్థులకు ప్రదానం చేశారు. అదేవిధంగా 387 పీహెచ్‌డీ పట్టాలను అందజేశారు. కార్యక్రమానికి శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యులు, పూర్వ ఉపకులపతులు, డీన్లు, పరీక్షల విభాగ అధికారులు, బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి హాజరయ్యేందుకు వరంగల్ ఎన్ఐటీలో అడుగుపెట్టిన రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం లభించింది. వరంగల్ మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, టీజీఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, కుడా ఛైర్మన్ వెంకట్రామ్ రెడ్డి తదితర అధికారులు పుష్పగుచ్ఛాలతో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పోలీసులు గౌరవ వందనం నివ్వగా, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

# సీజనల్ వ్యాధుల దృష్ట్యా మెడిసిన్ అందుబాటులో ఉంచాలి



- ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ
- టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెడిసిన్ లభ్యతపై దృష్టిసారించాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... త్వరలో రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున, ముందస్తుగానే మెడిసిన్ నిల్వలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటవుతున్న టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లకు అవసరమైన మెడికల్, డయాగ్నస్టిక్ ఎక్విప్‌మెంట్ మరియు ఫర్నీచర్ కొనుగోళ్లపై సమగ్ర ప్రణాళిక రూపొందించాల్సిందిగా సూచించారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉపయోగిస్తున్న టెక్నాలజీని అధ్యయనం చేసి, అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని ఆయన ఆదేశించారు. ఎక్విప్‌మెంట్‌కు గడువు (వారంటీ), రిపేర్ సేవలు ఉండేలా చూడాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

**సెంట్రల్ మెడిసినల్ స్టోర్లలో 3 నెలల మెడిసిన్ స్టాక్ ఉండాలి**

ప్రభుత్వ దవాఖానాల్లో మెడిసిన్ సరఫరా ఎలా ఉందన్న విషయంపై డీఎంఈ, డీహెచ్, టీవీవీపీ కమిషనర్‌లను మంత్రి ప్రశ్నించారు. కనీసం మూడు నెలలకు సరిపడా మెడిసిన్ స్టాక్‌ను సెంట్రల్ స్టోర్లలో ఉంచాలని టీజీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. ప్లేట్‌లెట్ సెపరేషన్ యంత్రాలు పాడవకుండా చూసుకోవాలని, అన్ని డయాగ్నస్టిక్ హబ్‌లలో టెస్టులు పూర్తిగా జరగాలన్నారు.

ప్రతి పీహెచ్‌సీలో టెస్టులు అవసరమైనవారి నుంచి సాంపిల్స్ తీసుకుని, 24 గంటల లోపు రిపోర్టులు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఒక్క టెస్ట్ కోసం అయినా పేషెంట్‌ను ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపే పరిస్థితి ఉండకూడదని హెచ్చరించారు.

గతేడాది ప్రతి జిల్లాలో మెడిసినల్ స్టోర్లను ఏర్పాటు చేశామని, వాటికి శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే, మెడికల్ కాలేజీలన్నింటిలోనూ సీటీ స్కాన్ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామని, అవసరమైతే ఎంఆర్ఐ యంత్రాల కోసం అదనంగా నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. ఎంఆర్ఐ యంత్రాల కొనుగోలు, స్థాపన ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

# స్వర్ణకారులపై పోలీసుల వేధింపులు ఆపాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రంలో కొందరు వ్యక్తులు పోలీసుల పేరును వినియోగిస్తూ స్వర్ణకారులను వేధిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆమె సోమవారం వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇటీవల వరుసగా జరుగుతున్న స్వర్ణకారుల ఆత్మహత్యలు కలచివేస్తున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

"విశ్వకర్మ వృత్తులవారు దేశానికి ఊపిరిగా నిలుస్తున్నారు. అయితే కార్పొరేట్ సంస్థల వల్ల వీరి వృత్తుల పట్ల ఆదరణ తగ్గిపోతోంది. ఈ వృత్తులను కొనసాగించేవారికి జీవనం నడపడం కష్టంగా మారింది" అని కవిత పేర్కొన్నారు. బంగారానికి భారతీయ సంస్కృతిలో ఉన్న ప్రాధాన్యతను ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు. "దొంగ బంగారం కొన్నారని స్వర్ణకారులపై కేసులు పెడుతున్నారు. కానీ అసలు దొంగల్ని పట్టించుకోవడంలేదు. ఈ వేధింపులు తట్టుకోలేకే కొంతమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఏవైనా పరిస్థితులు ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్యలు పరిష్కారం కాదని" ఆమె స్వర్ణకారులకు విజ్ఞప్తి చేశారు.

తాను నిజామాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో స్వర్ణకారులపై పోలీసుల వేధింపులు తగ్గించేందుకు కృషి చేశానని గుర్తుచేసిన కవిత, ఇప్పుడు మళ్లీ అదే సమస్య ఉద్ధృతంగా కనిపిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 411లో సవరణలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్వర్ణకారులే కాదు, ఇతర వర్గాలవారు కూడా ఈ వృత్తిలో ఉన్నారని, మహిళలు మెట్టెలు, మంగళసూత్రాలు చేయించుకోవడానికి స్వర్ణకారులనే ఆశ్రయిస్తారని కవిత అన్నారు. "బంగారు, వెండి ఆభరణాలు భారతీయులకు పవిత్రమైనవి. వాటిని రూపొందించేవారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిమీదా ఉంది" అని ఆమె స్పష్టం చేశారు.

# భారీ కింగ్ కోబ్రాను పట్టిన మహిళ బీట్ ఆఫీసర్

**బలగం టీవీ, తిరువనంతపురం**



కేరళకు చెందిన మహిళా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రోషిణి ఓ భారీ కింగ్ కోబ్రాను పట్టుకున్నది. ఆ ఘటనకు చెందిన వీడియో వైరల్ అవుతున్నది. ఆ వీడియోను రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ సుశాంత నంద షేర్ చేశాడు.

కేరళలోని తిరువనంతపురం జిల్లా కట్టకడలో విధుల్లో ఉన్న ఓ మహిళా అటవీశాఖ అధికారి భారీ కింగ్ కోబ్రాను చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ ఘటన జిల్లాలోని కట్టకడ రెసిడెన్షియల్ ప్రాంతంలో జరిగింది. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రోషిణి అనే మహిళా నిమిషాల్లోనే కింగ్ కోబ్రాను పట్టుకొని సంచిలో బంధించింది. కింగ్ కోబ్రా సుమారు 16 అడుగుల పొడుగు ఉన్నట్లు తెలుస్తోంది. స్నేక్ క్యాచింగ్ స్టిక్ దాన్ని ఆమె పట్టేసింది. ఆ తర్వాత దాన్ని సమీప అడవుల్లో వదిలేశారు. అయితే.. ఆమె పామును పట్టడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో రోషిణి చూపిన ధైర్యసాహసాలను స్థానికులు,నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ సుశాంత నంద .. బీట్ ఆఫీసర్ సాహసాన్ని మెచ్చుకున్నారు. రోషిణి ప్రస్తుతం కేరళ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లో పనిచేస్తున్నది. కింగ్ కోబ్రాను ఆమె పట్టుకోవడం ఇదే మొదటిసారి. ఆమె ఇప్పటి వరకు సుమారు 800 పాముల్ని పట్టుకున్నట్లు నంద తన ట్వీట్‌లో తెలిపారు. కేరళ అటవీశాఖలో 8 ఏళ్ల నుంచి రోషిణి పనిచేస్తున్నది. కేవలం అయిదు నిమిషాల్లోనే కింగ్ కోబ్రాను పట్టుకోవడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఓ స్నానపు కట్ట వద్ద ఆ స్నేక్‌ను గుర్తించిన స్థానికులు అటవీశాఖకు సమాచారం ఇచ్చారు.

# బీజేపీ అంతర్గత సమస్యలు పరిష్కరించుకోవాలి

- ఉప ఎన్నికల్లో గెలుపు మాదే
- ఎమ్మెల్యే దానం నాగేందర్



**బలగం టీవీ, హైదరాబాద్**

బీజేపీ పార్టీ తమ అంతర్గత సమస్యలను ముందుగా పరిష్కరించుకోవడం మంచిదని ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించాలని సూచించారు. "సికింద్రాబాద్‌కు బీఆర్ఎస్ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఏం చేశారు? పేరుకే పసుపు బోర్డు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటికీ ఆఫీస్ కూడా లేదు" అంటూ దానం విమర్శలు గుప్పించారు. తన మంత్రి పదవి విషయంలో అధిష్టానమే నిర్ణయం తీసుకుంటుందనీ, తాను పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికను సవాలుగా తీసుకుంటున్నాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



**బలగం టీవీ, హైదరాబాద్**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికను తెలంగాణ బీజేపీ పార్టీ ఓ సవాలుగా తీసుకుంటోందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. బలమైన ప్రతిపక్షం పోటీలో ఉన్నప్పుడు అధికార పార్టీకి గెలుపు సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. మంగళవారం బీజేపీ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక ప్రకటనలు చేశారు.


రాబోయే 25 రోజుల్లో పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటించనున్నట్టు వెల్లడించారు. పార్టీ కీలక నేతలతో చర్చించి, అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పిస్తూ కమిటీని రూపొందిస్తామన్నారు. పార్టీలో ఎటువంటి వర్గపోరాటాలు లేవని, అందరూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఐక్యంగా పని చేస్తున్నారని స్పష్టం చేశారు.

గతంలో స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ పెద్దగా దృష్టి సారించలేదని అంగీకరించిన ఆయన, ఈసారి వాటిపై ప్రత్యేక ఫోకస్ పెడతామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని శక్తివంతంగా నిలబెట్టేందుకు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలను ముమ్మరం చేస్తామని, పార్టీ బలోపేతానికి నూతన ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

మీడియా సంస్థలపై బీఆర్ఎస్ శ్రేణులు దాడులు చేస్తున్నాయని, ఇది అత్యంత దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడించినా బీఆర్ఎస్ నేతలకు ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. మీడియా సంస్థలకు ప్రభుత్వం తక్షణమే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏబీఎన్ కార్యాలయానికి భద్రత కల్పించాలని బీజేవైఎం కార్యకర్తలకు సూచించినట్లు తెలిపారు. ఇకపై మీడియాపై గానీ, సామాన్య ప్రజలపై గానీ దాడులు చేస్తే ఊరుకునేది లేదని, వారి అంతు చూస్తామని హెచ్చరించారు. "మీడియా సంస్థలపై దాడులు చేస్తే ఖబడ్దార్... టీ న్యూస్ సంగతి చూస్తాం" అని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తాము వాక్ స్వాతంత్ర్యాన్ని గౌరవిస్తామని, తమపై తప్పుడు వార్తలు రాస్తే న్యాయపరంగానే ఎదుర్కొంటామని, దాడులు చేయబోమని స్పష్టం చేశారు.

అదే సమయంలో, పాతబస్తీలోని సల్కం చెరువు భూమిలో ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ నిర్మించిన అక్రమ కాలేజీ భవనంపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఆయన తప్పుపట్టారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని భవనాన్ని కూల్చలేమని ప్రభుత్వం చెప్పడంపై మండిపడ్డారు. అక్బరుద్దీన్‌కు ఒక న్యాయం, మూసీ పరీవాహక ప్రాంతాల్లోని పేదలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఆ అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలని, లేకపోతే ప్రజల పక్షాన బీజేపీయే ఆ పని చేస్తుందని కాంగ్రెస్ సర్కారుకు అల్టిమేటం జారీ చేశారు.

# మాంసం తినేవారికి పార్టీలో చోటు లేదా



**- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి..**

**బలగం టీవీ, వికారాబాద్**

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సొంత పార్టీపైనే సంచలన వ్యాఖ్యలు చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, పార్టీ తీరుపై పలు ప్రశ్నలు సంధించారు. విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "మీకు దేశభక్తి, దైవభక్తి ఉంటే ఆర్ఎస్ఎస్, బజరంగ్ దళ్‌లలో చేరండి. బీజేపీ లాంటి రాజకీయ పార్టీలో ఉండే అర్హత మీకు లేదు" అని వ్యాఖ్యానించారు. బీజేపీ కేవలం ఒక రాజకీయ పార్టీ కాదని, దేశభక్తి పేరుతో కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీని బలహీనపరుస్తున్నారని ఆయన ఆరోపించారు. మాంసం తినేవారికి పార్టీలో స్థానం లేదంటే పార్టీ ఎలా బలపడుతుందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి కార్యకర్తలను సూటిగా ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత విభేదాలు, సిద్ధాంతపరమైన భేదాలపై చర్చకు దారితీసే అవకాశం ఉంది.

అంతేకాకుండా, "పైన మోడీ, ఇక్కడ నేను ఎలాగో గెలుస్తాం" అని పేర్కొంటూ, అధ్యక్ష పదవుల కోసం కొట్టుకోవడం మానేసి, పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కార్యకర్తలను ఆదేశించారు. ఈ వ్యాఖ్యలు పార్టీలోని అంతర్గత కుమ్ములాటలను, పదవుల కోసం జరుగుతున్న ప్రయత్నాలను పరోక్షంగా ప్రస్తావించినట్లుగా కనిపిస్తున్నాయి.



# గల్ఫ్ కార్మికుడిని అక్కున చేర్చుకున్న నిమ్స్..

**స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం**

**ఐఏఎస్ అధికారి దివ్యా దేవరాజన్ చొరవ**

**రూ.2 లక్షల ఆర్థిక సహాయం చేసిన 'సాటా'**

**బలగం టీవీ, హైదరాబాద్**

మెరుగైన చికిత్స కోసం తన కుమారుడు ప్యాట్ల సాయిబాబను సౌదీ నుంచి హైదరాబాద్ కు తెప్పించాలని నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం చేంగల్ కు చెందిన ప్యాట్ల గంగు ఇటీవల 'ప్రవాసీ ప్రజావాణి' లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట ఇచ్చిన వినతిపత్రానికి ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) స్పందించింది. తెలంగాణ ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం సమన్వయంతో రియాద్ నుంచి హైదరాబాద్ కు చేరిన పేషెంట్ వెంటనే నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించిన సంఘటన జరిగింది. సీఎం ప్రజావాణి నోడల్ అధికారి దివ్యా దేవరాజన్ చొరవ చూపారు.

సాయిబాబను అతని బంధువు అక్షయ్ రియాద్ నుంచి హైదరాబాద్ కు ఆదివారం ఉదయం తీసుకవచ్చారు. ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, టీపీసీసీ ఎన్నారై సెల్ అమెరికా విభాగం నాయకులు బొజ్జ అమరేందర్ రెడ్డి పేషెంటుకు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ లో అతని కుటుంబ సభ్యులతో కలిసి స్వాగతం పలికారు. సౌదీ అరేబియా తెలుగు అసోసియేషన్ (సాటా) ఈస్ట్రన్ రీజియన్ అధ్యక్షులు రంజిత్ చిట్టలూరి, నాగార్జున బృందం సాయిబాబ కు సహాయపడుతూ మానవతా స్ఫూర్తిని చాటారు. తలా కొంత చందాలు వేసుకుని విమాన టికెట్లు, రూ.2 లక్షల ఆర్థిక సహాయం చేశారు.

జూన్ 16న రియాద్ నుంచి దమ్మామ్‌కు స్వయంగా డ్రైవ్ చేస్తూ వెళ్తున్న క్రమంలో కారు టైరు పేలి ప్రమాదానికి గురయ్యాడు. వాహనం పల్టీలు కొట్టడం వలన తలకు గాయమైంది. సీటు బెల్ట్ ధరించినందువల్ల ప్రాణాపాయం తప్పింది. గాయాలపాలైన సాయిబాబను హఫూఫ్ లోని కింగ్ ఫహాద్ హాస్పిటల్ కు తరలించగా, తలకు శస్త్ర చికిత్స చేసి, జూన్ 25న డిశ్చార్జి చేశారు.

# డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి

**బలగం టీవీ, బోయినిపల్లి**



భారతదేశ ఐక్యత మరియు సమగ్రత కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన, దృఢమైన జాతీయవాద ఆలోచనాపరుడు, గొప్ప విద్యావేత్త, జనసంఘ్ వ్యవస్థాపకుడు, తమలాంటి కోట్ల మంది కార్యకర్తలకు నిరంతర మార్గదర్శకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నాయకులు అన్నారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మహనీయుని చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు పరశురాం మాట్లాడుతూ.. స్వతంత్ర భారత రాజకీయాకాశంలో సిద్ధాంతరహిత రాజకీయాలు, స్వార్థ, పదవీ వ్యామోహ వాదాల, కారు మబ్బులు కమ్ముకున్న ఆ తొలి దినాలలో ఒక మెరుపు మెరిసి మాయమైంది. కళ్ళు మిరిమిట్లు గొలిపే ఆ మెరుపు వెలుగు క్షణకాలమే కావచ్చు. కానీ, గాఢాంధకార భవిష్యత్తులో మునిగివున్న భారత ప్రజానీకానికి ఆమాత్రం వెలుగు చాలు. 'భారతీయ జనసంఘం' అనే వాస్తవమైన సైద్ధాంతిక రాజకీయ పథాన్ని కనుగొనడానికి స్వతంత్ర భారత రాజకీయాలకు ఒక నూతన దిశను, నూతన లక్ష్యాన్ని ప్రసాదించిన ఆ మెరుపే "డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ" అని కొనియాడారు.

# బీసీ,ఎస్సీ,ఎస్టీ మైనార్టీలకు అండగా ప్రభుత్వం



**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

రాష్ట్రంలోని బీసీ ఎస్టీ ఎస్సీ మైనార్టీ పేద ప్రజలకు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..సోమవారం వేములవాడ పట్టణంలోని చెక్కపల్లి బస్టాండ్ వద్ద ఎమ్మార్పీఎస్ వేములవాడ వారి ఆధ్వర్యం లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భవ దినోత్సవ, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై, ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు..ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ జరగాలని 31 సంవత్సరాలుగా పోరాటం చేశారని అన్నారు.. ఎమ్మార్పీఎస్ వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన మరుక్షణమే భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి,డా బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వర్గీకరణ అమలు చేయడం జరిగింద న్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ పేద వర్గాల చిరకాల సమస్యలను తీర్చడం జరిగిందన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**బలగం టీవీ, ధర్మారం**


పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండల కేంద్రంలో ఓ వృద్ధుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. సోమవారం సాయంత్రం కరీంనగర్ – రాయపట్నం రహదారిపై ఈ సంఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ అతివేగం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

ధర్మారం మండల కేంద్రానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ మేడవేని తిరుపతి తండ్రి మేడవేని చిన్నయ్య (68) ద్విచక్రవాహనంపై స్థానికంగా ఉన్న ఓ పెట్రోల్ బంక్‌కి వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. ఎడమవైపు నుంచి కుడివైపు ఉన్న పెట్రోల్ బంక్‌కి వాహనాన్ని మళ్లిస్తున్న తరుణంలో, అతివేగంగా వచ్చిన బొలెరో వాహనం చిన్నయ్యను బలంగా ఢీకొట్టింది. ఢీ కొట్టిన తర్వాత కూడా బొలెరో వాహనం ఆ ద్విచక్రవాహనాన్ని కొంత దూరం వరకూ ఈడ్చుకెళ్లింది. గాయాల తీవ్రత వల్ల చిన్నయ్య తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దృశ్యం చూసిన స్థానికులు తీవ్రంగా కలత చెందారు. ఘటన అనంతరం వాహన డ్రైవర్ భయంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై శీలం లక్ష్మణ్, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# ఆడబిడ్డల కోసం కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఆదర్శం

**ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**

**బలగం టీవీ, హుజూరాబాద్**



తెలంగాణలో పేద కుటుంబాలకు మేలు చేసేందుకు గల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్ వంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హుజూరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కమలాపూర్ మండలానికి చెందిన దాదాపు 100 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల మేనిఫెస్టోలో లేకపోయినా మాజీ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టి పేదింటి ఆడబిడ్డలకు మేనమామలా అండగా నిలిచారన్నారు. మొదట రూ.50వేలు నుంచి ప్రారంభమైన ఈ పథకం ఇప్పటివరకు రూ.లక్ష వరకు పెంచారని తెలిపారు. అన్ని కులాలకు చెందిన నిరుపేదలకూ ఈ పథకం వర్తించిందని వివరించారు. అలాగే, కేసీఆర్ కిట్ ద్వారా గర్భిణులకు పోషకాహార కిట్లు, ఆడబిడ్డకు జన్మనిచ్చిన అమ్మకు రూ.13 వేలు, మగబిడ్డకు రూ.12 వేలు అందించారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతుల సంఖ్య తగ్గడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ, పథకం పేరు మారినా సరే అమలు చేయాలన్నారు.

రైతులకు వితరణగా ఇచ్చే రైతు బంధు పథకాన్ని ప్రభుత్వ హామీ మేరకు ఎకరాకు రూ.15వేలు చెల్లించాల్సిందేనని, ప్రస్తుతం కేవలం రూ.12వేలు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. ఒక్కో రైతుకి కనీసం లక్ష రూపాయల బకాయిలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. యూరియా లభ్యత, నీటి వనరులపై కూడా ప్రభుత్వానికి సూచనలు చేశారు.

**ఇంటింటికీ 'కౌశిక్ అన్న'**

అదేరోజు హుజూరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో 31 మంది లబ్ధిదారులకు రూ.7.88 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇంటి వద్దకే పంపిణీ చేశారు. "ఆపదలో అర్ధరాత్రి అయినా పక్కన ఉంటానంటూ" భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో మండల నాయకులు తక్కలపల్లి సత్యనారాయణ రావు, మాజీ జెడ్పీటీసీలు నవీన్, ఇంద్రసేనా రెడ్డి, డైరెక్టర్లు కృష్ణప్రసాద్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

**పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**బలగం టీవీ, పెద్దపల్లి**



ప్రజావాణిలో వచ్చే ప్రజల ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, ఎలాంటి ఆలస్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి ఆయన పాల్గొన్నారు. అర్జీదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, వివరాలు తెలుసుకున్నారు. అధికారులు ప్రజలతో సానుభూతితో చేయాలని, అర్జీలు పెండింగ్‌లో ఉండకుండా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుల పేర్లకు దరఖాస్తు స్వీకరణ**

జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యత్వం కోసం అర్హులైన అభ్యర్థులు జులై 15 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తులను జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. కమిటీలో ఎంపికైన సభ్యులకు ఎలాంటి పారితోషకాలు ఉండవని కూడా స్పష్టం చేశారు.

జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది అని కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. వాతావరణ శాఖ ఇచ్చిన హెచ్చరికల మేరకు జులై 7 నుంచి 9 వరకు వర్షపాతం అధికంగా నమోదవుతుందని తెలిపారు.

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఈ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నీటి వనరులు, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల స్థితిని నిరంతరం పర్యవేక్షించాలి, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



# బీఆర్ఎస్ నాయకుడికి చల్మెడ పరామర్శ

**బలగం టీవీ, కరీంనగర్**

రుద్రంగి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగరావు గంగరాజం గుండె సంబంధిత సమస్యలతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల ఆయనకు గుండె ఆపరేషన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు సోమవారం ఆసుపత్రికి వెళ్లి గంగరాజాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన గంగరాజం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# అవును.. చిరంజీవితో కలిసి నటిస్తున్నాను



- త్రివిక్రమ్‌తో మరో సినిమా
- మినాతో 'దృశ్యం 3'
- విక్టరీ వెంకటేష్

**బలగం టీవీ, హైదరాబాద్**

సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న చిత్రం 'మెగా 157' షఉటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో చిరంజీవి తన అసలు పేరు శివ శంకర్ వరప్రసాద్‌గా నటించనున్న విషయం ఇప్పటికే అభిమానులను కట్టిపడేస్తోంది. నయనతార ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా, ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ కూడా కనిపించనున్నారని కొద్ది రోజులుగా ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి.తాజాగా అమెరికాలో జరుగుతున్న 'నాట్స్ 2025' ఈవెంట్‌కు హాజరైన వెంకటేష్ స్వయంగా ఈ వార్తను ధ్రువీకరించారు. చిరంజీవి నటిస్తున్న 'మెగా 157'లో తనకూ ఒక అతిథి పాత్ర ఉందని స్పష్టం చేశారు. తన పాత్ర చాలా ఫన్నీగా ఉంటుందని, ప్రేక్షకుల్ని నవ్వించేలా రూపొందించామని ఆయన తెలిపారు.

**త్రివిక్రమ్‌తో కొత్త సినిమా - దృశ్యం 3 వస్తోంది**

ప్రస్తుతం త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ కొత్త సినిమా చేస్తున్నట్లు కూడా వెంకటేష్ వెల్లడించారు. ఇక తన నటనా ప్రయాణంలో మరో ముఖ్య ప్రాజెక్ట్‌గా 'దృశ్యం 3'ను పేర్కొన్నారు. మలయాళంలో వచ్చిన మూడో భాగాన్ని తెలుగులో కూడా రూపుదిద్దుతున్నామని, ఇందులో మినాతో కలిసి మళ్లీ నటిస్తున్నానని చెప్పారు.

**మళ్లీ అనిల్ రావిపూడితో..**

ఇటీవల సంక్రాంతికి విడుదలైన అనిల్ రావిపూడి దర్శకత్వంలోని 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో నటించిన వెంకటేష్ – మళ్లీ అదే కాంబినేషన్ రిపీట్ కానుందని వెల్లడించారు. మరో భారీ ప్రాజెక్ట్‌లో తన స్నేహితుడితో కలిసి నటిస్తున్నానని, ఆయన తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద స్టార్ అని వెంకటేష్ ఆసక్తికరంగా పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ గురించి పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

# ఐసీసీ కొత్త సీఈవోగా సంజోగ్ గుప్తా

## 25 దేశాల నుంచి 2500 దరఖాస్తుదారులు



**బలగం టీవీ, దుబాయ్**

అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కొత్త సీఈవోగా ప్రముఖ మీడియా వ్యాపారవేత్త సంజోగ్ గుప్తా నియమితులయ్యారు. ఈ పోస్టుకు సంబంధించిన నియామక ప్రక్రియ చాలా సుదీర్ఘంగా కొనసాగింది. మార్చి 2025లో ప్రారంభమైన రిక్రూట్మెంట్ ప్రక్రియలో చివరికి గుప్తా ఎంపికయ్యారు. ఆయన వెంటనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

**2500 దరఖాస్తులు 12 మంది షార్ట్‌లిస్టు**

ఐసీసీ సీఈవో పదవికి ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల నుంచి సుమారు 2500 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వీరిలో క్రీడా పరిపాలనలో అనుభవం ఉన్నవారితో పాటు, అనేక సీనియర్ కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు పోటీపడ్డారు. చివరకు 12 మందిని షార్ట్‌లిస్ట్ చేసి, నామినేషన్ కమిటీకి వివరాలు పంపించారు. ఈ నామినేషన్ కమిటీలో ఐసీసీ డిప్యూటీ చైర్మన్ ఇమ్రాన్ ఖవాజా, ఈసీబీ చైర్మన్ రిచర్డ్ థాంప్సన్, ఎస్ఎల్‌సీ ప్రెసిడెంట్ షమ్మి సిల్వా, బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఉన్నారు. కమిటీ తుది ఎంపికగా సంజోగ్ గుప్తాను ఐసీసీ బోర్డుకు ప్రతిపాదించింది. ఐసీసీ చైర్మన్ జే షా ఆ పేరును ఆమోదించారు.

**మీడియా రంగం నుంచి సీఈవోగా ఎదిగిన గుప్తా**

జర్నలిస్టుగా తన కెరీర్‌ను ప్రారంభించిన గుప్తా, 2010లో స్టార్ ఇండియాలో చేరారు. కాంటెంట్, ప్రోగ్రామింగ్, వ్యూహాత్మక అంశాల్లో కీలక పాత్ర పోషించారు. డిస్నీ –స్టార్ ఇండియా స్పోర్ట్స్ విభాగానికి నాయకత్వం వహించిన గుప్తా, 2024 నవంబర్‌లో జియోస్టార్ స్పోర్ట్స్ సీఈవోగా నియమితులయ్యారు. "క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తాను"

సీఈవోగా నియామితుడైన అనంతరం గుప్తా ప్రకటన విడుదల చేశారు. "క్రికెట్ అభివృద్ధికి సర్వశక్తులు సమర్పిస్తాను. ఐసీసీ బోర్డు సభ్యులతో కలిసి పని చేయడానికి ఆసక్తిగా ఉన్నాను," అని

# అక్టోబర్ 2న 'కాంతార: చాప్టర్ 1'




**ఏడు భాషల్లో ప్రేక్షకుల ముందుకు**

**బలగం టీవీ, హైదరాబాద్**

కన్నడ స్టార్ హీరో రిషబ్ శెట్టి నటించిన 'కాంతార' ఎంతటి సంచలన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. భారతీయ ప్రేక్షకుల మనసులను కదిలించిన ఈ చిత్రానికి ఇప్పుడు ప్రీక్వెల్ రూపంలో సీక్వెల్‌గా 'కాంతార: ఏ లెజెండ్ – చాప్టర్ 1' రాబోతుంది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు. గాంధీ జయంతి సందర్భంగా 2025 అక్టోబర్ 2న 'కాంతార: చాప్టర్ 1' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా విడుదల తేదీని రిషబ్ శెట్టి పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఒక పవర్‌ఫుల్ పోస్టర్ ద్వారా ప్రకటించారు.

ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రిషబ్ ముఖాన్ని స్పష్టంగా చూపించలేదు. అయితే తాజాగా విడుదలైన బర్త్‌డే పోస్టర్‌లో మాత్రం ఆయన వరాహదేవుడి భక్తుడిగా వీరోచిత లుక్ తో కనిపించి ఫ్యాన్స్‌కు ఫుల్ ఫీస్ట్ అందించారు. ఈ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది.

ఈ చిత్రం కన్నడ, తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, ఇంగ్లీష్, బెంగాలీ భాషల్లో విడుదల కానుంది. ఇది కన్నడ ఫిల్మ్ ఇండస్ట్రీలోనే ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద పాన్–ఇండియా రిలీజ్ అవుతుందని హోంబలే ఫిలింస్ ప్రకటించింది.

'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్లను అందించిన హోంబలే ఫిలింస్ ఈ సినిమాను నిర్మిస్తోంది. రిషబ్ శెట్టే స్వయంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్లతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి.



# త్వరలో ఓటీటీలోకి '8 వసంతాలు'

**బలగం టీవీ, హైదరాబాద్**

జూన్ 20న థియేటర్లలో విడుదలైన '8 వసంతాలు' సినిమా ఇప్పుడు నాలుగు వారాలకే ఓటీటీ బాట పట్టుతోంది. ఫణింద్ర నరిశెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అనంతిక సనిల్ కుమార్, హనురెడ్డి, రవితేజ దుగ్గిరాల ప్రధాన పాత్రలు పోషించారు. సంగీతాన్ని 'హృదయం' ఫేమ్ హెషామ్ అబ్దుల్ వహాబ్ అందిం చారు. విడుదలకి ముందు సినిమాకు మంచి బజ్ ఏర్పడినా, థియేటర్లలో మాత్రం ఆశించిన స్థాయిలో యూత్‌కి రీచ్ కాలేకపోయింది. ఈ చిత్ర స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. జూలై 11వ తేదీ నుంచి ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు రానుంది. తెలుగు తో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల ఆడియోల్లో కూడా ఈ చిత్రం అందుబాటులో ఉండనుంది.



# మహేంద్ర సింగ్ ధోనీ పుట్టినరోజు వేడుకలు

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ 44వ ఏట అడుగుపెట్టారు. ఈ సందర్భంగా సినీ, రాజకీయ, వ్యాపార, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు అభిమానులు కూడా సోషల్ మీడియా వేదికగా ధోనికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ధోనీ బర్త్‌డే విషెస్ ట్రెండింగ్‌లో ఉన్నాయి. స్టార్ స్పోర్ట్స్ సైతం ధోనీ స్ఫూర్తిదాయక కెరీర్‌ను ప్రదర్శించేలా ఓ ప్రత్యేక వీడియోను విడుదల చేసి శుభాకాంక్షలు తెలిపింది.

**సింపుల్ సెలబ్రేషన్స్.. నెట్టింట వైరల్‌గా వీడియో**

తన జీవితాన్ని సాధారణంగా గడపడానికి ప్రాధాన్యత ఇచ్చే ధోనీ, ఈసారి కూడా పుట్టినరోజు వేడుకలను హంగులు లేకుండా నిర్వహించాడు. ఫ్యామిలీ మెంబర్స్ లేకుండా చిన్ననాటి స్నేహితుల సమక్షంలోనే కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ జరుపుకున్నాడు. ధోనీ బనియన్, షార్ట్స్ వేసుకుని స్నేహితులతో కలిసి ఉండగా కనిపించే ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. పుట్టినరోజు సందర్భంగా ధోనీ వారికి కేక్ తినిపిస్తూ వారి శుభాకాంక్షలు స్వీకరించాడు. కెప్టెన్‌గా ప్రపంచాన్ని ఆకట్టుకున్నా, కోట్ల సంపాదనలు చేసినా... తన రూట్‌లను మర్చిపోని ధోనీ.. తన చిన్ననాటి స్నేహితులతో సత్సంబంధాలను కొనసాగిస్తూ వారిలో కొందరిని తన వ్యాపార భాగస్వాములుగా చేసుకున్నాడు.

# ఆగస్టు 9న 'అతడు' 4కే రీ-రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**




సూపర్ స్టార్ మహేశ్ బాబు అభిమానులకు గుడ్ న్యూస్. ఆయన కెరీర్‌లో కల్ట్ యాక్షన్ థ్రిల్లర్‌గా నిలిచిన అతడు చిత్రం మళ్లీ థియేటర్లలోకి రాబోతోంది. సరికొత్త 4కే టెక్నాలజీతో రీస్టోర్ చేసి, 2025 ఆగస్టు 9న గ్రాండ్‌గా రీ–రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఆగస్టు 9న మహేశ్ బాబు పుట్టినరోజు కూడా కావడంతో, ఈ రీ–రిలీజ్ ఆయన ఫ్యాన్స్‌కి డబుల్ ట్రీట్ అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. సోషల్ మీడియాలో ఇప్పటికే Athadu4K, #SSMBBirthdayCelebrations అనే హ్యాష్‌ట్యాగ్స్ ట్రెండ్ అవుతున్నాయి. టాలీవుడ్‌లో రీ–రిలీజ్‌ల ట్రెండ్ బలపడుతున్న నేపథ్యంలో, 'అతడు' లాంటి కల్ట్ సినిమా 4కే టెక్నాలజీలో మళ్లీ బిగ్ స్క్రీన్ పై చూడడం అభిమానులకు స్పెషల్ అనుభూతిని కలిగించనుంది. న్యూ జనరేషన్‌కి ఈ క్లాసిక్‌ను థియేటర్‌లో ఆస్వాదించే అవకాశం ఇది.


# మళ్లీ నటనలోకి స్మృతి ఇరానీ

**బలగం టీవీ, హైదరాబాద్**

భారతీయ రాజకీయాల్లో కీలక స్థానం ఉన్న మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ మళ్లీ తన నటన ప్రస్థానానికి రీ ఎంట్రీ ఇచ్చారు. ఓ సమయంలో హిందీ టెలివిజన్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన సీరియల్ లిలి'క్యోంకి సాస్ బీ కబీ బహూ థీ'లిలిలో తులసీ పాత్రలో కనిపించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన స్మృతి, ఇప్పుడు అదే షోలో మళ్లీ కనిపించబోతున్నారు. తాజాగా విడుదలైన ఫస్ట్ లుక్‌లో స్మృతి ఇరానీ మెరూన్ చీర, బంగారు ఆభరణాలు, బ్లాక్ బీడ్స్ మంగళసూత్రం, ఎరుపు రంగ బొట్టుతో సంప్రదాయ లుక్‌లో దర్శనమిచ్చారు. అదే తరహాలో సీరియల్‌కి తగిన పాతకాలపు గ్లామర్‌కి నూతన ఉత్సాహాన్ని కలగజేస్తున్నట్లు కనిపిస్తోంది. తాజాగా 'వీ ది వుమెన్' షోలో బర్కా దత్, కరణ్ జోహార్తో మాట్లాడుతూ స్మృతి మాట్లాడుతూ "2014లో నేను తిరిగి సీరియల్‌కి ఓకే చెప్పాను. కానీ అప్పుడు పార్లమెంట్‌కు ఎన్నికైపో వడం వల్ల టీవీ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు." అంతేగాక, కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాల్సిన సమయంలో తాను కెరీర్‌కు కాకుండా దేశసేవకే ప్రాధాన్యత ఇచ్చానని తెలిపారు.

# మహేశ్ బాబుకు లీగల్ నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**



సూపర్ స్టార్ మహేశ్ బాబు రియల్ ఎస్టేట్ మోసానికి సంబంధించి వినియోగదారుల కోర్టులో మూడో ప్రతివాదిగా నామినేట్ అయిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కోర్టు ఆయనకు లీగల్ నోటీసులు జారీ చేసింది. అయితే తాజాగా ఈ కేసు విచారణను కోర్టు 2025 ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేసింది.

బాలాపూర్ ప్రాంతంలో ప్లాట్లు కొనుగోలు చేసే ఉద్దేశంతో ఒక మహిళా డాక్టర్ మరియు మరో వ్యక్తి కలిసి రియల్ ఎస్టేట్ వ్యవహారదారుడు కంచర్ల సతీష్ చంద్ర గుప్తా మాటలు నమ్మి రూ.34.80 లక్షలు చెల్లించారు. 'అన్ని అనుమతులతో కూడిన వెంచర్'గా ప్రచారం చేసిన సూర్య డెవలపర్స్ సంస్థ, మహేశ్ బాబు చిత్రంతో ఉన్న బ్రోచర్‌లను వినియోగించి ప్రచారం చేయడమే బాధితులకు నమ్మకం కలిగించినదిగా పేర్కొన్నారు.

ఈ కేసులో రియల్ ఎస్టేట్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించిన మహేశ్ బాబును మూడో ప్రతివాదిగా చేర్చారు. బాధితులు "మేము మహేశ్ బాబు యాడ్ చూసి ప్లాట్ కొన్నాం, మోసపోయాం" అని కోర్టుకు తెలిపారు. నోటీసులు అందిన తర్వాత వ్యక్తిగతంగా లేదా న్యాయవాది ద్వారా హాజరయ్యే అవకాశం ఉంది.